ఘనంగా ముందస్తు మహిళా దినోత్సవం
- పలువురికి సన్మానం..
6


పెద్దూర్‌లో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం..

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా కార్యాచరణ : కలెక్టర్
6

అన్నింటా 'ఆమె'..



- అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- అయినా ఆగని వేధింపులు, అకృత్యాలు
- బాధితులకు అండగా సఖి కేంద్రం
- జిల్లాలో సఖి కేంద్రానికి 1222 కేసులు
- ఇప్పటి వరకు 913 పరిష్కారం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఒకప్పుడు వంటింటికే పరిమితమైన 'మహిళ' ఇప్పుడు అన్ని రంగాల్లో తానై విజేతగా నిలుస్తోంది. నాడు ఆంక్షల సంకెళ్లతో కనిపించిన మహిళలు నేడు చైతన్యవంతులై చట్టసభల నుంచి ఆకాశం వైపు దూసుకుపోతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో చాలామంది మహిళలు హక్కులకోసం పోరాడుతూనే స్వశక్తిగా ఎదుగుతున్నారు. ఎన్ని అవరోధాలు వచ్చినా వాటికి ఎదురొడ్డి నిలుస్తూ ఉన్నతస్థాయి బాటలో పరుగులు తీస్తున్నారు. అన్నింట్లో తాము ముందున్నామని చాటి చెబుతున్నారు. ఆర్థికంగా బలపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో తమదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారు. చైతన్యవంతంగా అడుగులు వేస్తున్నా మహిళలకు వేధింపులు తప్పడం లేదు. చట్టాలు ఎన్ని వస్తున్నా మహిళలు, బాలలికలపై మృగాళ్ల అకృత్యాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అందుకు తీసిపోదు అన్నట్లుగానే చిన్నారుల నుంచి పెద్దవాళ్ల వరకు, కళాశాల విద్యార్థుల నుంచి ఉద్యోగినుల వరకు వేధింపులను ఎదుర్కొంటున్నారు. వీరికి సఖిఅండగా, బాసటగా, భరోసాగా నిలుస్తోంది. వివిధ రూపాల్లో హింస, వేధింపులకు గురవుతున్న వారిని అక్కున చేర్చుకొని ఓదారుస్తున్నారు. తప్పిపోయిన వారిని సొంతింటికి చేరుస్తున్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ పరిధిలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 2019 అక్టోబరులో ఏర్పడిన సఖికేంద్రం మహిళలకు వివిధ సేవలను అందిస్తోంది. అనేక కేసులకు పరిష్కారం చూపుతోంది.

● సఖి కేంద్రంలో 1222 కేసులు నమోదు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో సఖి కేంద్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 1222 కేసులు నమోదయ్యాయి. ఇందులో డొమెస్టిక్ వయోలెన్స్‌కు సంబంధించి 724 కేసులు, లైంగిక వేధింపులకు సంబంధించి 16 కేసులు, కిడ్నాపింగ్ 2, పోక్సో కేసులు 96, చైల్డ్ మ్యారేజ్ 7, మిస్సింగ్ 67, సైబర్, ప్రేమ చీటింగ్ 43, వరకట్న వేధింపులు 58, వరకట్న హత్యలు 2 కేసులననమోదు చేశారు. ఇందులో 309కేసులు కొనసాగుతుండగా, 913 కేసులను పరిష్కరించారు. డొమెస్టిక్ వయోలెన్స్‌లో 473 కేసులు, లైంగిక వేధింపుల్లో 11, పోక్సోలో 96, మిస్సింగ్ 67, సైబర్, లవ్ చీటింగ్ 39, వరకట్న వేధింపులు 34 కేసులను పరిష్కరించారు. పోక్సో కేసుల్లో రూ.73.45 లక్షల పరిహారాన్ని బాధితులకు అందించారు. సఖి కేంద్రంతో పాటు పోలీసులు భరోసా, షీటీమ్ వంటి కేంద్రాలు జిల్లాలో సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. ఇబ్బంది పడుతూ మహిళలు కేంద్రానికివస్తే మహిళలు న్యాయం అందించడంతో పాటు తాత్కాలిక వసతి, పోలీసుల ద్వారా రక్షణ, రెస్క్యూ వాహన సదుపాయం, పోలీస్ బాలల సంక్షేమ సమితి, చైల్డ్ లైన్, బాలరక్ష భవన్, ఇతర విభాగాలద్వారా సేవలు అందిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలకు అండగా నిలుస్తున్నా మృగాళ్ల దురాగతాలు ఆగడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అత్యాచార కేసులు 2022లో 38, 2023లో 21, గత సంవత్సరం 20 కేసులు నమోదయ్యాయి. 2023లో పోక్సో కేసులు 38 నమోదు కాగా, గత సంవత్సరం 47నమోదు చేశారు. పోలీసులు షీటీమ్ ద్వారా 2023లో 18 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి 24మందిపై కేసులు నమోదు చేశారు. గత సంవత్సరం 127మందికి కౌన్సెలింగ్ ఇచ్చి 44 కేసులు నమోదయ్యాయి. మహిళలకు రక్షణగా ఆపరేషన్ జ్వాల పేరుతో 2600 మంది విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ ద్వారా శిక్షణ ఇచ్చారు. బస్సుల్లో భరోసాలో 147 ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీస్ అక్క పేరుతో పోలీస్ కానిస్టేబుల్‌లతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

● అందుబాటులో టోల్ ఫ్రీ నంబరు..

జిల్లాలో సఖి కేంద్రం, మహిళ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు, అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. గృహ హింస పనిచేసే చోట, విద్యా సంస్థల్లో లైంగిక వేధింపులు, అత్యాచారాలు, స్త్రీలు, పిల్లల అక్రమ రవాణాను అరికట్టడానికి, బాధిత మహిళలకు అండగా టోల్ ఫ్రీ నంబర్లు నిరంతరం పనిచేస్తున్నాయి. మహిళ హెల్ప్ లైన్ 181, చైల్డ్‌హెల్ప్‌లైన్‌నంబర్ 1098లు 24గంటలు పనిచేస్తాయి.

● మహిళల రక్షణ చట్టాలు..

మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలున్నా హింస మాత్రం ఆగడం లేదు. మహిళల కోసం రోజురోజుకు చట్టాల్లో మార్పులు తీసుకరావడం, కొత్త చట్టాలు చేస్తున్నా గ్రామీణ మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. చట్టాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయనే విమర్శలు ఆగడం లేదు. మహిళలకు చట్టాలపై అవగాహన లేకపోవడమే ఒక కారణంగా చెప్పవచ్చు. అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న మహిళలపై హింస మాత్రం కొనసాగుతూనే ఉంది. ఒకవైపు ఇంట్లో, మరోవైపు బయట ప్రపంచంలో మహిళలపై హింసాత్మక సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రేమపేరుతో యువతులపై దాడులు చేస్తున్న సంఘటనలు కలవరపెడుతుంటే, ఇంటిలోపల కూడా స్త్రీలు హింసకు బలవుతున్నారు. అంతేకాకుండా కార్యాలయాలు, ఫ్యాక్టరీలు, పొలాలు, కార్ఖానాల్లోనూ లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయి.

● చట్టాలు ఉన్నా... ఆగని హింస

హింసకు వ్యతిరేకంగా దశాబ్దాల కాలంగా మహిళలు సాగిస్తున్న ఉద్యమాల ఫలితంగా 1970 తరువాత స్త్రీల సమస్యలపై చర్చకు వచ్చాయి. ఇందులో మహిళలు సాధించిన కుటుంబ హింస నుంచి మహిళలకు రక్షణ చట్టం 2005 ముఖ్యమైంది. అంతే కాకుండా నిర్భయలాంటి అనేక చట్టాలను సాధించారు. మహిళలకు రక్షణగా వచ్చిన ఎంతో ముఖ్యమైన చట్టం 498(ఎ)ను రూపొందించారు. ఆత్మాభిమానాన్ని కించపరచడం, స్త్రీల మనోభావాలను దెబ్బతీయడం వంటి చర్యలకు పాల్పడితే జైలుశిక్ష, జరిమానాలు వేస్తారు. మహిళలకు ఉన్న పరిమితుల దృష్ట్యా హింసకు గురవుతున్న ఆమె తరపు బంధువులు, సంక్షేమ సంఘాలు కూడా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. ఐపీసీ 312 సెక్షన్ ప్రకారం గర్భంలో ఉన్నది ఆడశిశువు అని తెలిసి గర్భస్రావం చేయించిన బాధ్యులకు మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా. మహిళ మరణిస్తే 10 ఏళ్ల జైలుశిక్ష ఉంది. 509 సెక్షన్ ప్రకారం విద్యార్థినులు..

మిగతా 6లో

మహిళా సంఘాలకు 9 బస్సులు
- రెండు మండలాల్లో సోలార్ ప్లాంట్ల ప్రతిపాదనలు


సిరిసిల్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆర్థిక చేయూతను ఇచ్చే దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. మహిళ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఆర్టీసీకి అనుసంధానం చేస్తూ బస్సులను అందిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో 9బస్సులు వేములవాడ రూరల్,చందుర్తి, బోయినపల్లి, కోనరావుపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట,వీర్నపల్లి తొమ్మిది మండలాల్లోని మహిళ గ్రూపులకు ఒక్కొక్క బస్సును మొదటి విడతగా అందిస్తున్నారు. దాదాపు 32లక్షల వరకు ఉండే ఈ బస్సు ప్రత్యేక గ్రాంట్‌లో అందిస్తున్నారు. బ్యాంక్ అనుసంధానంతో ఉండే బస్సు సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ డిపోల ద్వారా నిర్వహించనున్నారు. ప్రతినెలా రూ.77వేల వరకు సంఘానికి ఆదాయం వస్తుంది. దీంతోపాటు తంగళ్లపల్లి, కోనరావుపేట, వేములవాడ అర్బన్ మండలాల్లో మహిళ సంఘాల ఆధ్వర్యంలో సోలార్‌విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు కూడా ప్రారంభించనున్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి ఒక మెగావాట్‌కు రూ.3 కోట్ల వరకు ఖర్చు అవుతుంది. మహిళ సంఘాలు రూ.30 లక్షల సమకూరిస్తే మిగతా డబ్బులు బ్యాంక్‌ల ద్వారా సమకూరుస్తారు. ఉత్పత్తి ప్రారంభించినప్పని నుంచి విద్యుత్‌ను ఎన్‌పీడీసీఎల్‌కు, జెన్‌కోకు విక్రయిస్తారు. ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్ల ద్వారా వచ్చే ఆదాయం బ్యాంక్‌రుణాలను తీర్చడంతోపాటు మిగతా డబ్బును సంఘాల బలోపేతానికి వినియోగిస్తారు.

ఆఫీస్ సబార్డినేట్ సస్పెన్షన్

ఇల్లంతకుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి పశువైద్యశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న దేవమ్మను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. దేవ మ్మ గత సంవత్సరం జూన్ నెల నుంచి సెలవులలో ఉన్నారు. వైద్య ధ్రువీకరణ పత్రాలు సమర్పించగా అధికారుల విచారణలో తప్పుడు ధ్రువీకరణపత్రాలు అని తేలడంతో సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మానేరు వాగు నుంచి ఇసుకను తీయనివ్వబోమంటూ మండలంలోని వెంకటాపూర్‌లో రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. మానేరు వాగులోకి వెళుతున్న ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. కలెక్టర్ ఆదేశాలను అమలు చేయాలని లేని పక్షంలో కేసుల పాలవుతారని తహసీల్ అధికారులు పేర్కొనడంతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆర్ఐ శ్రావణ్‌కుమార్ అక్కడ నుంచి వెనుదిరిగారు. కాగా, ఇసుక తరలింపును అడ్డుకుంటున్నారనే సమాచారంతో ఆర్ఐ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలోని సిబ్బంది మానేరు వాగు వద్దకు వెళితే రైతులు విధులకు ఆటంకం కలిగించారని పేర్కొంటూ కేసులు నమోదు చేశామని తహసీల్దార్ రామచంద్రం పేర్కొన్నారు. అభివృద్ధి పనుల కోసం ఇసుకకు అనుమతి ఇస్తే అడ్డుకోవడం సరైంది కాదని అన్నారు.


రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 శనివారం
సహర్ 5:09 ఆదివారం

విద్యార్థులకు అభినందన

సిరిసిల్ల రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధి పెద్దూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కరాటేలో మెడల్స్‌లను సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి అభినందించి సర్టిఫికెట్‌లను అందజేశారు. కరాటే మాస్టర్ సమ్మయ్య, ఉపాధ్యాయులు రవీందర్, శ్రీని వాస్, భాగ్యనగర్ మాధ వి, లకావత్‌ఉమా, బైరివాణిశ్రీ, కదర్ల కల్పన, వీణా, శంకర్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 116 మంది గైర్హాజరు..

సిరిసిల్ల రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియేట్ పరీక్షల్లో శుక్రవారం 3,997 మంది విద్యార్థులకు 3,881మంది హాజరుకాగా 116 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విభాగంలో 3,411 మంది విద్యార్థులకు 3,345 మంది హాజరుకాగా, 66మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 586మందికి 536మంది హాజరుకాగా 50 మంది గైర్హాజరయ్యారు. సిరిసిల్ల పట్టణంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి శ్రీనివాస్ పరిశీలించి, కళాశాలల ప్రిన్సిపాల్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎల్‌వోసీ అందజేత

వేములవాడ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణం భగవంతరావునగర్ చెందిన పండుగ సంతోష్ అనే యువకుడు గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు తెలుపగా కుటుంబ సభ్యులు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంప్రదించారు. ఆయన స్పందించి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయంగా గత నెలలో వైద్య ఖర్చులకు 6లక్షల రూపాయల ఎల్‌వోసీని అందించారు. శుక్రవారం అదనంగా మరో 2 లక్షల రూపాయల ఎల్వోసీని మంజూరుచేసి అందించారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో తోడ్పాటునందించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- బ్యాంకర్లతో డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటును అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు కొత్త బ్యాంక్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని, ప్రస్తుతం చందుర్తి మండలం మల్యాల గ్రామంలో యూబీఐబ్రాంచీ పనులు జరుగుతున్నాయన్నారు. రుద్రంగి, కోనరావుపేట మండలాల్లో కూడా బ్యాంక్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని, బ్యాంక్‌ల ద్వారా అందించే రుణాలు పెరగాలన్నారు. డిసెంబరు 30నాటికి క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తి 128.81 శాతం ఉందని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రైతులకు పంట రుణాల కింద రూ.1519 కోట్లు పంపిణీ లక్ష్యం కాగా డిసెంబరు నాటికి రూ.808 కోట్లు పంపిణీ చేశామని అన్నారు. పెండింగ్ లక్ష్యాన్ని యాసంగి పంటకు పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. వ్యవసాయ టర్మ్ రుణాల కింద రూ 420 కోట్లు లక్ష్యంకాగా రూ 405.92 కోట్లు డిసెంబర్ నాటికి అందించడం అభినందనీయమన్నారు.

వ్యాపార యూనిట్లకు రూ.280 కోట్లు..

జిల్లాలో వ్యాపారయూనిట్ల ఏర్పాటుకు బ్యాంకర్లు తోడ్పాటును అందించాలని ఎంఎస్ఎంఈలకు ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో రూ 559 కోట్ల లక్ష్యం కాగా రూ.280 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. ప్రతి బ్యాంక్ బ్రాంచి నుంచి కనీసం 5 వ్యాపార యూనిట్లు గ్రౌండింగ్‌కు చర్యలు చేపట్టాలని అర్హులైన యువతకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 5 నాటికి 3997 స్వశక్తి సంఘాలకు రూ.498.64 కోట్లు మెప్మా కింద 444 సంఘాలకు రూ 54.7కోట్ల రుణాలు అందించామని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్, యూబీఐ రీజినల్ ప్రతినిధి అపర్ణారెడ్డి, ఆర్బీఐ ఎల్‌డీవో సాయితేజరెడ్డి, డీఆర్‌డీవో శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో మరింత చైతన్యం రావాలి
- వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి


సిరిసిల్లలో మాట్లాడుతున్న వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

సిరిసిల్ల రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళల్లో మరింత చైతన్యం రావాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని అంకారపు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బీజేపీ మహిళా మోర్చా జిల్లా కమిటీ అధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చదువుపై దృష్టి సారించి మంచిగా చదువుకొని ఉద్యోగాలను సాధించుకొని పురుషులతో సమానంగా పనిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శేషాద్రినిరెడ్డితో పాటు గైనకాజిస్ట్ డాక్టర్ తడుక రవళి, కోనరావుపేట మాజీ ఎంపీపీ సంకినేని లక్ష్మీ, వైస్‌చైర్మన్ మాధవి, కోనరావుపేట మండల అధ్యక్షురాలు తీగల జయశ్రీ, తంగళ్లపల్లి మండల అధ్యక్షురాలు కోడం భవిత, పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ పద్మ, జాతీయ క్రీడాకారిణి రామనుజమ్మ, బీజేపీ సీనియర్ నాయకురాళ్లు అసాని లావణ్య, సుస్మితలతో పాటు మహిళా న్యాయవాదులు, రైతులను ఘనంగా సన్మానించారు.


ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ, పట్టణ అధ్యక్షురాలు పండుగ మాధవి, నాయకులు గరిపెల్లి ప్రభాకర్, అన్నల్‌దాస్ వేణు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్పీగా మహేశ్‌బాబా సాహెబ్


మహేశ్‌బాబా సాహెబ్

సిరిసిల్ల క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా గీతే మహేశ్‌బాబా సాహెబ్‌ను నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సిరిసిల్లలో విధులు నిర్వర్తించిన ఎస్పీ అఖిల్ మహాజన్‌ను అదిలాబాద్ ఎస్పీగా బదిలీపై వెళ్లారు. ములుగు జిల్లా ఓఎస్డీగా పనిచేసిన మహేశ్ బాబా సాహెబ్ సిరిసిల్లకు బదిలీపై ఎస్పీగా మొదటి పోస్టింగ్‌కు ఇచ్చారు. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌కు చెందిన మహేశ్ బాబా సాహెబ్ 2020లో ఐపీఎస్‌గా సెలక్ట్ అయ్యారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన పూణేలో బీఎస్సీ అగ్రికల్చర్ చదివారు. రెండో ప్రయత్నంలో ఎలాంటి కోచింగ్ లేకుండానే సివిల్స్ రాసి ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ఐపీఎస్‌కు ఎంపిక అయిన తొలిసారి ఉమ్మడి కరీంనగర్ జిల్లా చొప్పదండి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా మూడు నెలలు శిక్షణ పొందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా తొలి పోస్టింగ్ వరించింది.





సెల్‌ఫోన్ దొంగల పట్టివేత



దొంగలను తాళ్లతో కట్టేసిన స్థానికులు

పెద్దపల్లిటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలను స్థానికులు పట్టుకున్నారు. ఈసాలతక్కళ్ళపల్లికి చెందిన ఓవ్యక్తి హైదరాబాద్ వెళ్ళేందుకు గురువారం పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ట్రెయిన్ ఆలస్యంగా ఉండడంతో అక్కడే ఒకచోట కూర్చోగా ఇద్దరు వ్యక్తులు అనుమానంగా తిరుగుతూ కనిపించారు. కొంతసేపటి తరువాత సెల్‌ఫోన్ కనబడలేదు. దీంతో గురువారం రాత్రంతా వెతుకగా తెల్లవారు స్థానికుల సహాయంతో ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. రెండు సెల్‌ఫోన్లలో ఒకటి తిరిగి ఇచ్చారు. ఇద్దరి చేతులను తాళ్ళతో కట్టి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామని చెప్పారు. కాగా, పోలీస్‌స్టేషన్లో ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. చోరీకి పాల్పడిన నిందితులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సతీష్, రాములుగా తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన జీవన్

తంగళ్లపల్లి (సిరిసిల్లరూరల్), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దెనపల్లి గ్రామంలో ఇంటి ముందు ఆడుకుంటున్న జీవన్ అనే బాలుడిపై శుక్రవారం సాయంత్రం వీధికుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పర్వతాల మహేష్, సరిత దంపతుల కుమారుడైన జీవన్ సాయంత్రం స్కూల్ నుంచి వచ్చి ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కల గుంపు వచ్చి దాడి చేసి తలతో పాటుచెవులు, శరీరంపై పలుచోట్ల కరిచాయి. దీంతో బాలుడి అరుపులు విన్న గ్రామస్థులు కుక్కల గుంపును తరిమివేసి చికిత్స కోసం సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడిపై శుక్రవారం పిచ్చికుక్క దాడి చేసింది. గ్రామానికి చెందిన రాజలింగం అనే ఆర్‌ఎంపీ వైద్యుడు తన ఇంటి ముందు నిలబడి ఉండగా అటువైపు వచ్చిన ఓ పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. చికిత్స నిమిత్తం చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మండల కేంద్రంలో వారంపది రోజుల నుంచి పదిమందికి పైగా దాడిచేసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది పిచ్చికుక్కల రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గేదెపై చిరుత దాడి..

● ఆందోళనలో అన్నదాతలు..

వేములవాడ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ శివారులో రైతుకు చెందిన గేదెపై చిరుతపులి దాడి చేయడంతో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి నారాయణ రోజులాగే తన పొలం వద్ద ఉన్న షెడ్డులో గేదెను కట్టివేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం వెళ్లి చూడగా గేదెపై దాడి చేసి ఉండడం, వెనుక భాగం పూర్తిగా తిని ఉండటం చూసి గ్రామస్థులకు సమాచారం అందించారు. వెంటనే స్థానికులు అక్కడికి వెళ్లి చూడగా గేదెపై పులి దాడి చేసినట్లు ఉంది. ఫారెస్ట్అధికారి ఖలీల్ ఉద్దీన్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇంకా పులి అనే విషయాన్ని ఆయన నిర్ధారణ చేయలేదని, గేదెను చంపిన అనంతరం పులి అటవీప్రాంతానికి వెళ్లినట్లు అక్కడ ఉన్న మహిళలు భయపడుతున్నారు. పులి పాదాలకు సంబంధించిన ఆనవాళ్లు కనబడడంతో సమీప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హైనా దాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరికి చెందిన జీల మల్లేశ్‌యాదవ్ అనే రైతుకు చెందిన లేగ దూడ శుక్రవారం హైనాదాడిలో మృతి చెందింది. వ్యవసాయ బావివద్ద రోజువారిగానే పశువులను కట్టేసి వచ్చిన మల్లేశ్ శుక్రవారం ఉదయం బావి వద్దకు వెళ్లేసరికి లేగదూడమృతి చెందిఉంది. ఈవిషయం ఫారెస్టు, రెవెన్యూఅధికారుకు తెలియజేసి నట్లు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాముడిపెంట ప్రాంతంలోని తాళంవేసి ఉన్నఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్‌ఐ రామచంద్రుడు శుక్రవారం తెలిపారు. పోలీసులు, బాధితుడు మైలారం అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య తన కుటుంబసభ్యులతో వారం రోజుల క్రితం హైదరాబాదులోని కుమారుడి వద్దకు వెళ్లారు. గురువారం రాత్రి సమయంలో ఇంటికి తిరిగి రాగా తలుపులకు వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉండగా, ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడి ఉంది. దీంతో అంజయ్య పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రామచంద్రుడు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించాడు. బీరువాలో ఉన్న మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, 50వేల రూపాయల నగదు అపహరణకు గురియినట్లు అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామచంద్రుడు తెలిపాడు.

వేములవాడలో..

వేములవాడ టౌన్: పట్టణంలోని మున్నూరుకాపుసత్రం సమీపంలో తాళంవేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కుమార్ అనే ఇంటి యజమాని వేడుక నిమిత్తం గురువారం ఇంటికి తాళంవేసి ఊరికి వెళ్లారు. కార్యక్రమం ముగించుకొని శుక్రవారం ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండగా గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లోని దాదాపు తులం బంగారు ఆభరణాలతో పాటు 30 తులాల వెండి ఆభరణాలు చోరీఅయ్యాయని వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హుజూరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లోని కాకతీయ పాఠశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేగంగా, అజాగ్రత్తగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ రోడ్డు పక్కన ఆగిఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్నఇద్దరిలో యాకూబ్‌కు తీవ్రగాయాలు కాగా, ముజాహిద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనేవారిని108లో జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ బస్‌లో వ్యక్తి మృతి

వీణవంక, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఒడ్డెపల్లి ఓదేలు(58) ఆర్టీసీ బస్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఓదెలు కరీంనగర్‌లో ఓ ప్రైవేటు బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజువారిగా శుక్రవారం సాయంత్రం ఆర్టీసీబస్‌లో రెడ్డిపల్లి నుంచి కరీంనగర్ వెళ్లాడు. బస్సు అల్గునూరు వద్దకు వెళ్లగానే పక్కకు పడిపోవడంతో గమనించిన తోటి ప్రయాణికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందిచడంతో ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిపారు.

మహాలక్ష్మి

ఇబ్బందులు తొలగేనా?

● ఆర్టీసీలో పెరగని బస్సులు ● పెరిగిన మహిళల రద్దీ



కరీంనగర్ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న మహిళలు

భగత్‌నగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరంగా మారినా, అందుకనుగుణంగా తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల సంఖ్య పెంచక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత వచ్చే రెండవ మహిళా దినోత్సవం నుంచైనా మహిళల కోసం అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను పెంచి ఇబ్బందులు తొలగించాలని మహిళలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం (మహాలక్ష్మి) పథకాన్ని అమలు చేసినా దానికనుగుణంగా బస్సు సర్వీసులు లేక మహిళామణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోలు ఉండగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ, హుస్నాబాద్, హుజూరాబాద్, గోదావరిఖని, మంథని డిపోలు ఉన్నాయి. రీజియన్ వ్యాప్తంగా తొమ్మిది వందలపై చిలుకు బస్సులు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రూట్లలో బస్సులు నడిపిస్తున్నా పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచక పోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త బస్సులను ప్రవేశపెడతామని చెప్పిన ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను మాత్రం తీసుకు వచ్చింది. ఎలక్ట్రిక్ బస్సులు పట్టణాలకే పరిమితమవడంతో గ్రామీణ ప్రాంతాలకు బస్సుల కొరత ఉంది. కరీంనగర్ నుంచి రాయపట్నం, గోదావరిఖని, జగిత్యాల, హుజూరాబాద్ రూట్లలో మహిళల రద్దీ తీవ్రంగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్- రాయపట్నం రూట్‌లో మహాలక్ష్మి పథకానికంటే ముందే రద్దీ తీవ్రత ఎక్కువగా ఉండేది, మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత మహిళల రద్దీ పెరగడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

మహిళలు ఉన్న చోట్ల ఆగని బస్సులు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో బస్టాండ్లలోనే బస్సులు నిండిపోతున్నాయి. ప్లాట్ ఫాంలపైకి రాక ముందే బస్సుల్లోకి ఎక్కేందుకు ప్రయాణికులు హైరానా పడుతున్నారు. ఉన్న కొద్ది పాటి బస్సులతోనే అన్ని రూట్లలో బస్సులు నడిపిస్తున్నా రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ దాటినతర్వాత బస్సులు ఎక్కాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. నగరంలోని వివిధ బస్టాపులలో మహిళలు ఎక్కువగా ఉంటే డ్రైవర్లు బస్సులు ఆపడం లేదని అంటున్నారు. మహిలలను డ్రైవర్లు, కండక్టర్లు చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకునైనా అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను పెంచే ప్రకటన చేయాలని మహిళలు కోరుతున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలు వినియోగించుకునేలా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కృషి చేయాలని మహిళలు కోరుతున్నారు.

బస్సులు ఆపడం లేదు: సాహితి, విద్యార్థిని



మహిళలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో బస్సులు ఆపడం లేదు. విద్యార్థులు దూరప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. మహాలక్ష్మి పథకం మహిళలు వినియోగించుకునే విధంగా బస్సులు ఆపాలి. బస్సుల సంఖ్యను పెంచాలి.

బస్సుల సంఖ్యను పెంచాలి: కీర్తన, గృహిణి



పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఎక్కువగా బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. మహిళల కోసం ప్రత్యేక బస్సులు ఆర్టీసీ నడిపించాలి.



బస్సును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్న లారీ



డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోయిన లారీ

కోరుట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెనుప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సును తప్పించబోయి భారీలోడుతో వస్తున్న లారీ డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో బస్సులోఉన్న ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం ఉదయం జగిత్యాల నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీబస్సు డ్రైవర్ గమనించకుండా ఇన్ గేట్ నుంచి బస్టాండ్‌లోకి బస్సును తీసుకుపోతున్నాడు. ఇదే సమయంలో మెట్‌పల్లి నుంచి జగిత్యాలవైపు వెళ్తున్న లారీడ్రైవర్ బస్సును తప్పించబోయాడు. దీంతో పక్కనే ఉన్న డీవైడర్‌ను ఢీకొట్టింది. సంఘ టనలో ఎలాంటి ప్రాణనష్టం చోటు చేసుకోలేదు. ఈ సంఘటనతో బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

దేవాలయాల్లో చోరీ

శంకరపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రేణుకఎల్లమ్మ, పోచమ్మదేవాలయాల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మొలంగూర్ గ్రామంలో గురువారం అర్థరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్‌గ్రామంలోని రేణుక ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయాల్లో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలకొట్టి ప్రవేశించారు. ఆలయంలోని హుండీల తాళాలను ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరగడం ఇది మూడోసారి అని గౌడసంఘం నాయకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం రగుడు చౌరస్తాలోని మహాశివరాత్రి సందర్భంగా కట్టెలతో ఏర్పాటుచేసిన కమాన్‌లో శుక్రవారం రాత్రి బైక్ ఇరుక్కొని ముస్తాబాద్ మండలం తుర్కపల్లికి చెందిన ప్రశాంత్(32)కు తీవ్రగాయాలయ్యాయి. వేములవాడ నుంచి సిరిసిల్ల వైపు ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదం సంభవించింది. తీవ్రగాయాలతో కమాన్‌లో ఇరుకున్న యువకుడిని స్థానికులు బయటకు తీసి చికిత్స కోసం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

వేములవాడ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణం తిప్పాపూర్ శివారులోరోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఆగిఉన్న లారీని కారు ఢీకొట్టింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్సై సముద్రాల రాజు ఘటన స్థలానికిచేరుకొని ప్రమాదానికిగల కారణాలను పరిశీలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎమ్మెల్యేలకు రూ. ఐదు కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు

● నిధుల ఖర్చులో వేసవిలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి ● మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు... సంస్థాగతంగా బలోపేతం కావాలి ● ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ● హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో సమీక్షా సమావేశం



సమావేశంలో చర్చిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

కరీంనగర్ అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి నియోజకవర్గానికి స్పెషల్‌డెవలప్‌మెంట్‌ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద 5కోట్ల రూపాయలు ఇస్తున్నామని, గతంలో ఇచ్చిన 10కోట్లకు ఇవి అదనమని ఉమ్మడిజిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సంబంధించి పెండింగ్ అంశాలు, అభివృద్ధి పనులపై హైదరాబాద్‌లోని జలసౌధలో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గతంలో ఎస్‌డీఎఫ్ 10 కోట్ల నిధుల్లో ఎంత వరకు పనులు జరిగాయని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మంజూరు చేస్తున్న ఐదు కోట్ల నిధులను తాగునీటి సంబంధ అవసరాలకు మొదటి ప్రాధాన్యంతో ఖర్చుచేయాలని మంత్రులు సూచించారు. అనంతరం ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపై చర్చించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, మరో మూడు నెలల్లో స్థానికసంస్థల ఎన్నికలు ఉంటాయని మంత్రి తెలిపారు. ఈలోగా నియోజకవర్గాల్లో నీటి పారుదలకు సంబంధించిన పెండింగ్ పనులుంటే త్వరగా పూర్తి చేసేలాచర్యలు తీసుకోవాలని సూచించారు. శాసనసభ్యులు కలిసి కట్టుగా జిల్లా అభివృద్ధిపై దృష్టిని సారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, సంజయ్‌కుమార్, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పురుమల్ల శ్రీనివాస్, జువ్వాడి నర్సింగరావు, ప్రణవ్‌బాబు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న కేంద్ర సమాచార, ప్రసారభారతి అధికారులు

వేములవాడ కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీపార్వతి రాజరాజేశ్వరస్వామి వారిని శుక్రవారం కేంద్ర సమాచార శాఖ ప్రసారభారతి అధికారులు దర్శించుకున్నారు. ప్రసారభారతి తెలంగాణ క్లస్టర్ హెడ్ హరిసింగ్, దక్షిణాది రాష్ట్రాల జోనల్ హెడ్ గీతారాణిలు దర్శించుకునిప్రత్యేకపూజలు నిర్వహించారు. ముందుగా కోడెమొక్కు చెల్లించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ శ్రీనివాస్, టీసి లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది ఉన్నారు.



ఆశీర్వదిస్తున్న అర్చకులు

కొడుకును ఉద్యోగంలో పెట్టించేందుకు నకిలీ ధ్రువపత్రాల సృష్టి

● తండ్రితో పాటు సహకరించిన ముగ్గురి రిమాండ్ ● నిందితుల్లో విశ్రాంత తహసీల్దార్, డీఎంహెచ్‌వో ఉద్యోగి



నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కొడుకును ఉద్యోగంలో పెట్టించేందుకు నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించిన తండ్రితోపాటు ఆయనకు సహకరించిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నిందితుల్లో కరీంనగర్ పట్టణానికి చెందిన విశ్రాంత తహసీల్దార్ చిమ్మల బీరయ్య, డీఎంహెచ్‌వోలో విధులు నిర్వహిస్తున్న మహ్మద్ బాసిద్ హుస్సేన్‌లు ఉన్నారని చెప్పారు. ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వివరాలను ఆయన వెల్లడించారు. మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక పశు వైద్యశాలలో లైవ్‌స్టాక్ అధికారిగా పని చేస్తున్న కరీంనగర్ పట్టణానికి చెందిన జడ కొమురయ్య కాలేయ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నానని, అనారోగ్య కారణంగా ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ పొందేందుకు రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆయన దరఖాస్తును పరిశీలించారు. దాంతో కొమురయ్య నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించారని ఎల్లారెడ్డిపేట పశు వైద్యాధికారి ఈ నెల 1న స్థానిక పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రమాకాంత్ కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తును చేపట్టారు. జడ కొమురయ్య తాను అనారోగ్య కారణంగా ఉద్యోగవిరమణ పొంది కొడుకును తనస్థానంలో ఉద్యోగంలో పెట్టించాలని కరీంనగర్‌కు చెందిన విశ్రాంత తహసీల్దార్ చిమ్మల బీరయ్యను సంప్రదించారు. అందుకు రూ.3లక్షలు ఇవ్వాలని బీరయ్య చెప్పడంతో కొమురయ్య అప్పగించారు. విశ్రాంత తహసీల్దార్ బీరయ్యకు డీఎంహెచ్‌వోలో విధులు నిర్వహిస్తున్న మహ్మద్ బాసిద్ హుస్సేన్‌ను పరిచయం చేసి వివరాలు తెలిపారు. ఆయనకు తెలిసిన కరీంనగర్‌లోని ల్యాబ్ టెక్నీషియన్ కొత్తపల్లి రాజేశంను కలవాలని సూచించారు. రాజేశం వద్ద కరీంనగర్‌లోని సన్‌షైన్ ఆసుపత్రికి సంబంధించిన నకిలీపత్రాలు, స్టాంపులు, అందుబాటులోని లేని వైద్యుల సంతకాలు ఫోర్జరీ చేసి ధ్రువీకరణ పత్రాలను సృష్టించామని విచారణలో అంగీకరించారు. వారి వద్ద నుంచి ఆసుపత్రికి సంబంధించిన నకిలీపత్రాలు, 18 నకిలీ స్టాంపులు, కంప్యూటర్, మానిటర్, సీపీయూ, పవర్ కేబుల్, సిస్టం లింక్ కేబుల్‌ను స్వాధీనపర్చుకున్నామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు. ఆయన వెంట ఎస్‌ఐ రమాకాంత్ ఉన్నారు.

పెళ్లి ఊరేగింపులో కారు ఢీకొని మహిళ మృతి



ఉమ (ఫైల్)

శంకరపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పెళ్లి ఊరేగింపులో కారు ఢీకొని మహిళమృతిచెందిన సంఘటన మండలంలోని మెట్‌పల్లిగ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. ఈనెల6 గురువారం రోజున మెట్‌పల్లిలో బకారపు ప్రభాకర్ కుమార్తె నవ్య వివాహం మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన జినుక అశోక్‌తో జరిగింది. సాయంత్రం అప్పగింతలు అయిన తర్వాత కారు డ్రైవర్ కురుమ శ్రావణ్ ప్రభాకర్ ఇంటినుంచి నూతన వధూ వరులను, బంధువులను కారులో తీసుకొని ఊరేగింపు కార్యక్రమానికి బయలు దేరారు. ఊరేగింపులో భాగంగా నృత్యాలు చేస్తుండగా డ్రైవర్ శ్రావణ్‌కు ఫోన్ రావడంతో కారు దిగి పక్కకెళ్లి మట్లాడుతున్నాడు. ఈక్రమంలో పెళ్లి కుమారుడు అశోక్ కారును హఠాత్తుగా ముందుకు పోనిచ్చాడు. దీంతో కారు అక్కడ నృత్యాలు చేస్తున్న బకారపు ఉమ(35), కూతురు బకారపు నిఖితతోపాటు పలువురు పైకి దూసుకెళ్లింది. వెంటనే ఉమను భర్త పర్శరాములు హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం వరంగల్ ఎంజీఎంకు, అక్కడినుంచి హైదరాబాద్ తీసుకెళ్తుండగా శుక్రవారం తెల్లవారుజామున మార్గమధ్యలో మృతిచెందింది. ఉమ కూతురు నిఖితకు కుడి భుజం, కాలు విరిగింది. మృతురాలి భర్త బకారపు పర్శరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

న్యాయం చేయాలంటూ ఆందోళన..

హుజూరాబాద్: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి ఎదుట శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలోని పెళ్లి ఊరేగింపులో గాయపడి మృతిచెందిన బకారపు ఉమ, గాయపడిన వారికి నష్టపరిహారం అందించి న్యాయంచేయాలని శుక్రవారం బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఎండుతున్న పంటలు.. రోడ్డెక్కిన రైతులు..

● సిద్దిపేట-కామారెడ్డి రహదారిపై బైఠాయింపు



గంభీరావుపేట పెద్ద కాలువ వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

గంభీరావుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట పెద్ద కాలువ ఆయకట్టు రైతులు రోడెక్కారు. పంటలు ఎండుతుండటంతో సిద్దిపేట- కామారెడ్డి రోడ్డుపై బైఠాయించి, సాగునీరు ఇవ్వాలనిడిమాండ్ చేశారు. ఎగువమానేరు నీటిని నమ్ముకుని పెద్ద కాలువ కింద 2000ఎకరాలకు పైగా పంటలు వేశామని, ఇప్పుడు పెద్ద కాలువలో చుక్కనీరు లేదని వాపోయారు. ఎగువ మానేరు నీటిని పెద్ద కాలువలోకి విడుదల చేస్తేనే పంటలు దక్కే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రత్యేక తూం ఏర్పాటు చేస్తేనే పెద్ద కాలువ ఆయకట్టు రైతుల సమస్యకు శాస్వత పరిష్కారం దొరుకుందన్నారు. సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రోడ్డుపై ఆందోళన చేయడంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. రైతుల ఆందోళనకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. పరిస్థితి తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీస్‌లు అక్కడికి చేరుకుని వారిని శాంతింపచేసే ప్రయత్నం చేశారు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా ఆందోళన విరమించాలని పోలీసుల సూచనల మేరకు రైతులు శాంతించారు. ఈ ఆందోళనలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు ప్రసాద్‌రెడ్డి, స్వామి, రాజు, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.





హక్కుల కోసం పోరాడాలి..

డాక్టర్ కె శ్రీవాణి, అర్ధశాస్త్రం విభాగం అధిపతి, శాతవాహన విశ్వవిద్యాలయం

మహిళా హక్కుల కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వంటి మహిళామణుల స్ఫూర్తిని స్మరించుకుంటు ముందుకు సాగాలి. మహిళా సాధికారత అనేది ఒక్క రోజులో సాధించలేము. ప్రతిరోజు మనం ఒక ముందడుగు వేస్తే కచ్చితంగా లక్ష్యాన్ని చేరుకోగలం. మహిళా దినోత్సవం మహిళల హక్కుల కోసం పోరాడేందుకు, లింగ సమానత్వం సాధించేందుకు ఒక గొప్ప అవకాశం.



మహిళా సాధికారతను ప్రోత్సహించాలి..

మెట్టు విజయలక్ష్మి, అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ

ప్రజాసామ్యంలో మహిళలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ప్రజాసామ్య వ్యవస్థ సమాన హక్కులు, అవకాశాలను అందించే సిద్ధాంతంపై ఆధారపడి ఉంటుంది. మహిళల హక్కులు, స్వేచ్ఛ, రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వంలాంటి వాటిని ప్రోత్సహించాలి. పురుషులతో సమాన హక్కులను మహిళలకు కల్పించడంతో పాటు మహిళా సాధికారతను ప్రోత్సహించాలి. మహిళల రాజకీయ ప్రాతినిధ్యం ప్రజాస్వామ్య వ్యవస్థలో కల్పించాలి. మహిళలపై వివక్ష, లింగ అసమానతలు, హింస వంటి సమస్యలను ఎదుర్కోవడానికి చట్టాలు, విధానాలను రూపొందించాలి.



అసమానతలు తొలగాలి..

డాక్టర్ స్రవంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఇప్పటికీ మహిళలపై అణచివేత కొనసాగుతూనే ఉంది. మహిళలు అన్ని రంగాల్లోకి ముందుకు రావాలంటే విద్య ఉద్యోగం వ్యాపారం రాజకీయాల్లో సరైన భాగస్వామ్యం అనేది తప్పనిసరి. అసమానతలు తొలగినప్పుడే ఇది సాధ్యమవుతుంది. సమాజంలో ఒక మహిళను బలపరిస్తే ఆమె ఒక కుటుంబాన్ని బలపరుస్తుంది. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి.

అన్ని రంగాల్లో ప్రాధాన్యమివ్వాలి..

మిట్టగడుపల సౌజన్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, సిరిసిల్ల



మహిళలు చేయలేని పనులు లేవు. అన్ని పనులను ఎలాంటి కష్టం లేకుండానే చేసుకుంటూ పోతుంటారు. మహిళలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పడమే తప్ప ఎక్కడా అమలు చేయడంలేదు. కనీసం గుర్తించడం కూడా లేదు. నిరంతరం ఎలాంటి అలసట లేకుండా కష్టపడుతున్న మహిళలకు సమాజంలోని అన్నిరంగాల్లో ప్రాధాన్యమివ్వాలి. ఆదరించి గుర్తింపునివ్వాలి.

సమాన హక్కులు కల్పించాలి..

ఎంపీ భారతి, జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ, సిరిసిల్ల



సమాజంలో మహిళలకు పురుషులతో సమాన హక్కులను కల్పించడంతో పాటు స్వేచ్ఛను ఇవ్వాలి. కుటుంబాల్లో మహిళలను పురుషులతో సమానంగా చూడాలి. చదువు నేర్పించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల విషయంలోనే కాకుండా ప్రతి విషయంలో కూడా ఆడ,మగ సమానం అనే ఆలోచన విధానంతో ప్రతి ఒక్కరూ ఉండాలి. మహిళలు అన్నిరంగాల్లో ధైర్యంగా ముందుకెళ్లాలి. ఎలాంటి ఒత్తిళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి.

ఆకాశంలో సగం



కరీంనగర్ సమీపంలోని ఎల్ఎండీలో తెప్ప నడుపుతున్న యువతి

ప్రపంచానికి మార్గదర్శకంగా మహిళా శక్తి

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటారు. 2025 మహిళా దినోత్సవాన్ని 'ప్రతి మహిళకూ, ప్రతి బాలికకూ హక్కులు, సమానత్వం, సాధికారత' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళలు సాంకేతిక రంగంలో రాణించడం, సమాన అవకాశాలు పొందడం, డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఈ థీమ్ ముఖ్య ఉద్దేశం. 1975 మార్చి 8న ఐక్యరాజ్యసమితి అధికారికంగా ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రతిపాదించింది.

-గణేశ్‌నగర్, కరీంనగర్ టౌన్, కరీంనగర్ కల్చరల్, జగిత్యాల, సిరిసిల్ల

అన్ని రంగాల్లో రాణించాలి

బీఎస్ లత, అదనపు కలెక్టర్, జగిత్యాల



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి. విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయం, వ్యాపారం ఇలా పలురంగాల్లో మహిళలు కీలకపాత్రను పోషించాలి. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. వంటింటికి మహిళలు పరిమితం కాదని, అవసరమైన ఏబాధ్యతనైనా సమర్ధవంతంగా నిర్వర్తిస్తారని చాటాలి. గొప్పగొప్ప మహిళల నేపథ్యాలను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలి.

వెనుకబాటుతనం పోవాలి..

సత్యమ్మ, జిల్లా ఉపాధి కల్పనాధికారి, జగిత్యాల



మహిళల్లో వెనుకబాటుతనం పారద్రోలేందుకు వారిలో ధైర్యం కల్పించాలి. మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహించి చట్టాలు, శిక్షలపై వారికి వివరిస్తూనే మనోధైర్యం పెంచాలి. అన్నిరంగాల్లో ధైర్యంగా ముందుకు వచ్చే విధంగా వారికి ప్రోత్సాహం కావాలి. వారిలో చైతన్యం తీసుకువచ్చే విధంగా స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాలు చేపట్టాలి.

మహిళలు తమ శక్తిని చాటుకోవాలి

సీహెచ్ సోఫియా, జిల్లా కోశాధికారి, జగిత్యాల



మహిళలు వంటింటికే పరిమితం కాకూడదు. చదువులో ముందుండి ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ శక్తిని చాటుకోవాలి. తమకు నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని స్వశక్తితో ముందుకు వెళ్లాలి. సమాజంలో మహిళల పాత్ర ఎంత గొప్పదనే విషయాన్ని ప్రతీ ఒక్కరికి అర్థమయ్యేలా ఎదగాలి. మహిళ ఉద్యోగులను గౌరవించాలి.

దిక్సూచిగా నిలవాలి

సుజాత, డిస్ట్రిక్ట్ ఆడిట్ అధికారి, జగిత్యాల

ఒకప్పుడు నాలుగు గోడల మధ్య వంటింటి కుందేళ్లుగా మహిళలు ఉండే వారు. ఈరోజు మహిళ లు అన్ని రంగాల్లో రాణిస్తు న్నారు. స్వశక్తితో మహిళలు రాజకీయ రంగాల్లో దూసుకెళ్తున్నారు. ఉద్యోగం స్త్రీ బాధ్యతగా చేపట్టినప్పుడే మహిళా లోకం ఆర్థికంగా ఎదుగుతారు. సమాజానికి దిక్సూచిగా మహిళలు నిలవాలి.



మహిళలు ఆర్థికంగా ఎదగాలి

డాక్టర్ సుజాత, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, కరీంనగర్

మహిళలు ఆర్థిక స్వతంత్రత సాధించాలి. అది విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. విద్య ద్వారా మానసికోల్లాసం కూడా లభిస్తుంది. మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించడం ద్వారా పేదరికంతోపాటు ఆధారపడడమనే చక్రాన్ని విచ్ఛిన్నం చేయవచ్చు.





మహిళల హక్కులపై అవగాహన కల్పించాలి

డాక్టర్ పొలాస మాధవి, ప్రొఫెసర్, చల్మెడ మెడికల్ కాలేజీ.

మహిళల హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఇది అందరూ బాధ్యతగా తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నవయస్సులో పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. విద్య, ఉద్యోగ రంగాల్లో లింగ వివక్ష లేకుండా చూడాలి.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కె.సబిత, జిల్లా సంక్షేమ అధికారి, కరీంనగర్

మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో చాలా మంది ఉపాధిపొందుతున్నారు. వ్యాపార రంగంలోనూ రాణించాలి ఏ రంగంలోనైనా విజయం సాధించగలమనే విశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగాలి.





మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

కట్ట మంజులాదేవి, సూపరింటెండెంట్, జవహర్ బాలభవన్

అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ప్రతీ మహిళా ఎవరినో ఒకరిని స్ఫూర్తిగా తీసుకోవాలి. నాకు స్ఫూర్తి ఎంఎస్ సుబ్బులక్ష్మి. అందుకే సంగీతం నేర్చుకున్నా.. నేర్పుతున్నా. కొన్నేళ్లుగా బాలభవన్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నా.

స్వతంత్రంగా జీవించాలి..

ప్రొఫెసర్ డి వరలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కరీంనగర్



మహిళలు స్వతంత్రంగా జీవించాలి. నిరంతర నైపుణ్యాలు మెరుగుపరచడం, వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధి కోసం ప్రయత్నించాలి. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి.

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పించాలి

సీహెచ్ నిరోష, లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మానకొండూర్



మహిళలు పని ప్రదేశంలో ఇంకా మహిళలు సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించాలి. అన్ని రంగాల్లో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది.

అన్ని రంగాల్లో మహిళల ముందంజ

నాయిని సుప్రియ, ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్



అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉంటున్నారు. ఇది గొప్ప విషయం. మహిళలు తలచుకుంటే కానిదేమీ ఉండదు. ధైర్యంతో ఇంకా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఓ మహిళా అధికారిగా ఆనందంగా ఉంది.

మహిళా సాధికారత సాధించాలి

ఎ.సరిత, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కరీంనగర్

మహిళలు అన్ని అంశాల్లో సాధికారత సాధించాలి. గ్రంథాలయంలో మహిళలు, యువతులు, విద్యార్థినుల పఠన కోసం సంస్థ చైర్మన్ చొరవతో ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు. మహిళల రక్షణ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, సేవలపై అవగాహన పెంచుకోవాలి.



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

స్వరూపరాణి, డిప్యూటీ కమిషనర్, కరీంనగర్ నగర పాలక సంస్థ

మహిళలకు ఏ బాధ్యత అప్పగించినా అది నిబద్ధతతో పూర్తి చేస్తారు. ఏ పనిలోనైనా నమ్మకం, విశ్వాసం కలిగి ఉంటూ అన్ని రంగాల్లో రాణిస్తారు. చదువులో ముందుండి అనుకున్న లక్ష్యాన్ని సాధించినప్పుడే సమాజం గౌరవిస్తుంది. సమాజంలో గౌరవం పొందేందుకు ప్రతి మహిళా పట్టుదలతో ముందుకెళ్లాలి.





కలిసికట్టుగా స్వయం ఉపాధి వైపు..



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న పెద్దపల్లి కలెక్టర్ శ్రీహర్ష

- చిల్లపల్లి గ్రామానికి జాతీయ పురస్కారం
- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం
- ప్రోత్సాహకంగా రూ. 75 లక్షలు
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చిల్లపల్లి సక్సెస్ స్టోరీ

మంథని/మంథనిరూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఐక్యత, క్రమశిక్షణ, పరస్పర సహకారంతో మంథని మండలంలోని చిల్లపల్లి మహిళలు స్వయం ఉపాధి పొందుతూ వివిధ రకాల వ్యాపారాలతో ఆర్థికంగా ఎదుగుతున్నారు. తమ చదువును, పొందిన వృత్తి నైపుణ్యాన్ని ఉపాధి వైపు మళ్లించి ఇంతింతై వటుడింతై అన్నట్లుగా స్వయం సమృద్ధిలో దూసుకెళ్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు గ్రామంలో శ్రీజ్యోతి మహిళా గ్రామైక్య సంఘంలోని 33 సొసైటీల్లో సభ్యులుగా ఉన్న 335 మంది చేయిచేయి కలిపారు. అయితే డబ్బును పొదుపు చేయడమే కాదు కాలానికి అనుగుణంగా పురుషులతో సమానంగా పోటీ పడి ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రణాళికలు వేసుకున్నారు. ఈ క్రమంలో స్వయంగా ఉపాధి వైపు అడుగులు వేసి విజయవంతమయ్యారు. తమ డబ్బును సంఘాలలో జమ చేసుకుంటూ, అందులో నుంచే రూపాయి వడ్డీకి రుణం తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో వీరంతా కిరాణ షాపులు, కుట్టు మిషన్లు, కోళ్ల పెంపకం, పాడిగేదెలు, కంగన్ హాల్, చికెన్ షాప్, బ్యూటీపార్లర్స్, టిఫిన్ సెంటర్లు, డ్రాగన్ ఫ్రూట్స్ తోట, పిండి గిర్ని, కూరగాయల సాగు, మెడికల్ షాపు, ఐకేపీ సెంటర్ నిర్వహణ, అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేయడం తదితర పనులతో మహిళలు స్వయం ఉపాధితోపాటు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. తమ సంఘాల్లో రూపాయి వడ్డీకి రుణం తీసుకుని ఉపాధి పొందుతూ వివిధ వ్యాపారాల్లో రాణిస్తూ, గ్రామాభివృద్ధిలో కీలకంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం ఉత్తమ గ్రామంగా గుర్తించింది.

దేశ వ్యాప్తంగా 27 గ్రామ పంచాయతీల్లో గ్రామంలో 9 అంశాలను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు ప్రకటించగా ఇందులో ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో చిల్లపల్లి పంచాయతీకి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం దక్కింది. 2024 డిసెంబర్ 11న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కలెక్టర్ కోయ శ్రీహర్ష పురస్కారం అందుకున్నారు. పురస్కారం తోపాటు రూ. 75 లక్షల నగదు ప్రోత్సాహాన్ని గ్రామానికి దక్కేలా చిల్లపల్లి గ్రామ మహిళలు తమ శక్తిని చాటారు.





గ్రామంలో మహిళా సంఘం సభ్యుల సమావేశం, టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

పని చేసుకుంటూనే టైలరింగ్‌లో శిక్షణనిస్తున్నా

రామిళ్ళ మల్లేశ్వరి, చిల్లపల్లి.



భర్త వ్యవసాయం చేస్తుండగా నేను కుట్టు పని చేసుకుంటూ ఉపాధి పొందుతున్నా. అలాగే గ్రామంలోని చాలా మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నా.. ఇప్పటి వరకు 40 మంది మహిళకు పైగా శిక్షణ ఇచ్చాను. జ్ఞానోదయ పొదుపు సంఘంలో రెండేళ్ల కిందట రూ.లక్ష రుణం తీసుకొని కుట్టు యంత్రాలు కొనుగోలు చేశాను. కుట్టు పని, శిక్షణ తోపాటు చీరలు, దుస్తులు అమ్ముతున్నా. వీటి ద్వారా ఆదాయం పొందుతున్నాను.

మహిళల కృషితోనే జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు

ఆరె సౌజన్య, సీఏ, చిల్లపల్లి.



శ్రీజ్యోతి గ్రామైక్య సంఘంలో సభ్యులందరితో నెలకు రెండు సార్లు మీటింగ్ పెట్టుకుంటాం. ఇందులో ఆర్థిక లావాదేవీలతోపాటు మహిళల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన అంశాలపై చర్చిస్తాం. సంఘంలోని సభ్యులందరు వివిధ రకాల వ్యాపారాలు చేసుకోవటానికి లోన్లు తీసుకొని తిరిగి వడ్డీతో కలిసి చెల్లిస్తుండటంతో ఇతర సభ్యులకు రుణాలు సకాలంలో ఇవ్వటానికి వీలుకల్గుతుంది. సంఘ సభ్యుల స్వయం ఉపాధితో గ్రామంలో వారి కుటుంబాలు అన్ని విధాలుగా సంతోషంగా ఉన్నాయి. వీరి ఆర్థిక క్రమశిక్షణ, స్వావలంబన, స్వయం ఉపాధి జాతీయ స్థాయిలో మా గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడం సంతోషంగా ఉంది.

న్యూస్ బాక్స్

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ముస్తాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ ధర్మాశాస్తానగర్ లోని అయ్యప్ప ఆలయంలో ఉచిత కంటి వైద్యశిబిరానికి నిర్వహించారు. వైద్యులు చింతోజు శంకర్, కల్వకుంట్ల లక్ష్మణ్‌రావు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కల్వకుంట్ల రమదేవి స్మారకార్థం శంకర నేత్రాలయ మద్రాస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజారాం, డాక్టర్ చంద్రశేఖర్‌రావు, మాజీ సర్పంచ్ నడిమెల ఎల్లం, విజయ్ పాల్గొన్నారు.

నిమ్మపల్లిలో వైద్య శిబిరం

కోనరావుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో మెడికల్ క్యాంపు మండల వైద్యాధికారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కుష్టు వ్యాధి నివారణ కోసం ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు వైద్యాధికారి వేణుమాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధి అనుమానితులను గుర్తించి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. డిపిఎమ్ఓ దేవ్‌సింగ్, సూపర్‌వైజర్, ఏఎన్ఎం సరోజ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మంజూరుచేయాలి

ఇల్లంతకుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బీటీ రోడ్డు మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు రెండు గ్రామాల నాయకులు వినతి పత్రం అందించారు. కరీంనగర్‌లో మంత్రిని కలిసిన నాయకులు గాలిపెల్లి గ్రామం నుంచి వంతడుపుల మీదుగా వల్లంపట్ల గ్రామం వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని విన్నవించారు. అందుకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సామ బాల్‌రెడ్డి, కాట్నపెల్లి రవీందర్‌రెడ్డి, చిమ్మనగొట్టు శ్రీనివాస్, కట్ట నర్సింహ్మారెడ్డి, జనగాం రాజు, కర్ల లక్ష్మన్, పందిల్ల శ్రీకాంత్, నరేందర్, సంతోష్‌కుమార్‌రెడ్డి, మధురెడ్డి, కనుకయ్య, తిరుపతి తదితరులు ఉన్నారు.

ఘనంగా ముందస్తు మహిళా దినోత్సవం



కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి ఆర్డీవోను సన్మానిస్తున్న అధికారులు



కేక్ కట్ చేస్తున్న డీఎంహెచ్‌వో రజిత

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు ఘనంగా సన్మానించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సిరిసిల్ల ఇన్‌చార్జ్ ఆర్డీవో రాధాబాయి, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ జానకి, రోజా, పౌరసరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మీ, మేనేజర్ రజితలను సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసచారీ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల అర్బన్ పరిధి పెద్దూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, ఏఐపీసీ చైర్‌పర్సన్ తిప్పవరం సుధా, ఉపాధ్యాయులు భాగ్యనగర్ మాధవి, బైరి శ్రీవాణి, లకావత్ ఉమ, కడార్ల కల్పన, నాగుల వీణ, రమాదేవి, కీర్తి, దీక్ష, లక్ష్మీ, ఆశా కార్యకర్తలు తమ్మెట లావణ్య, అంగన్‌వాడీ టీచర్ రేణుక, భూమవ్వ, మధ్యాహ్న భోజన కార్మికులు పుష్ప, సుగుణ, మమతలను సన్మానించారు. ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, నందాల శంకర్, రాజమల్లు, రవికుమార్ పాల్గొన్నారు. కాగా, సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వేడుకలను నిర్వహించారు. నెహ్రూనగర్‌లోని జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కోడం భారతి, అడుప కీర్తి, కరుణశ్రీ, పత్తెంపద్మలను ప్రధానోపాధ్యాయులు నాగుల భాగ్యరేఖ,గణేష్‌లతోపాటు ఉపాధ్యాయులు వాసాల హరిప్రసాద్, రఫీయొద్దీన్, గన్నమనేని శ్రీనివాస్‌రావులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాలల హెచ్‌ఎం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, అల్మాస్‌పూర్, దుమాల, హరిదాస్‌నగర్, తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. మండల పరిషత్తు కార్యాలయంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఎంపీడీవో సత్తయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో కొమురయ్య, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల డీఎంహెచ్‌వో కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మహిళా వైద్యాధికారులను, సిబ్బందిని సన్మానించారు.

● ముస్తాబాద్ : జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను హెచ్‌ఎం అంబటి రవీందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఉపాధ్యాయులు రాజ్‌మహమ్మద్, లక్ష్మణ్, శ్రీమతి, జ్యోతిరాణి, జోత్స్న, ప్రజలప్రసాద్ శ్రీనివాస్ గోవర్ధన్, వీరస్వామి, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : ఎస్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థం మాధవి హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్ పద్మజ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి సదానందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాట్ల మల్లేశం, మోడల్ స్కూల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బత్తిని సత్యనారాయణగౌడ్, గోపి, తిరుపతి, రాజు, సదానందం, ఉన్నారు.

● రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల యజమాన్యం మహిళా ఉపాధ్యాయులకు సత్కరించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తీపి రెడ్డి వెంకటిరెడ్డి, ఎర్రం గంగ నర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో శుక్రవారం టీఆర్‌టీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కోనరావుపేట మండలంలో పనిచేస్తున్న మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్, హెచ్‌ఎం ప్రవీణ్ కుమార్, వికృతి హన్మాండ్లు గౌడ్, పులి ప్రవీణ్ కుమార్, జ్ఞానేందర్, భాస్కర్, పద్మారెడ్డి, వనిత, సబితా, స్వాతి, శ్రీదేవి, బాలమణి, రేణుక, ప్రవళిక, శారద, చందన, అఖిల, సంధ్యారాణి, పద్మావతి, రమ్య, కృష్ణవేణి, కవిత, తదితరులు పాల్గొన్నారు.



వేములవాడలో..

అన్నింటా 'ఆమె'..

(3వ పేజీ తరువాయి)

మహిళలు, ఉద్యోగినుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడినా, కించపరిచినా, సైగలు చేసినా సాధారణ జైలుశిక్ష, జరిమానా ఉంది. సెక్షన్ 354 ప్రకారం అత్యాచారం చేయాలనే ఉద్దేశ్యంతో ఎవరైనా మహిళపై దాడిచేస్తే రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా ఉంటుంది. సెక్షన్ 366 ద్వారా ఎవరైనా మహిళను ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకోవాలనో, చేయించాలనో, వివాహేతర సంబంధం పెట్టుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రలోభాలకు గురిచేస్తే 10 ఏళ్ల జైలుశిక్ష ఉంది. 18 ఏళ్లలోపు యువతితో(ఆమె అనుమతితో) లైంగిక సంబంధం పెట్టుకున్నా అత్యాచారంగానే పరిగణించి శిక్షిస్తారు.

మహిళా దినోత్సవం నేపథ్యం ఇదీ..

మహిళా దినోత్సవ నేపథ్యం పరిశీలిస్తే పోరాటాల చరిత్ర కనిపిస్తుంది. శాంతి కోసం, ప్రజాస్వామ్యం కోసం, సోషలిజం కోసం జరిగిన పోరాటంలో ప్రపంచమంతటా శ్రామిక మహిళలు అంతర్జాతీయ ఐక్యత దినోత్సవంగా మార్చి 8ముందుకు వచ్చింది. 1908 మార్చి 8న న్యూయార్క్‌లో రిడ్జర్ స్క్వేర్ వద్ద వేలాది మంది కుట్టు పని చేసే మహిళా కార్మికులు పనిగంటల కోసం, ఓటు హక్కు కోసం మహిళలు ప్రదర్శనలు జరిపారు. ఈ ప్రదర్శన మహిళల్లో ఉత్సాహం నింపింది. రెండు సంవత్సరాల తరువాత 1910 డెన్మార్క్‌లోని కోపెన్‌హాగెన్‌లో అంతర్జాతీయ సోషలిస్టు మహిళల సదస్సు జరిగింది. అందులో క్లారా జెట్కిన్ మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినంగా, మహిళల హక్కుల దీక్షా దినంగా జరపాలని నిర్ణయించారు. అప్పటి నుంచి ప్రపంచంలో పలు దేశాల్లో మహిళా దినోత్సవాని గుర్తించినా.. భారతదేశంలో మాత్రం 1975, మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గుర్తించారు.

రిపోర్టులోని అంశాలను సవరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇల్లంతకుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ ఇచ్చిన రిపోర్టులోని అంశాలను సవరించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ ఫారూఖ్‌కు వినతి పత్రం అందించారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శుక్రవారం డప్పులతో ర్యాలీ నిర్వహించారు. మండలశాఖ అధ్యక్షుడు మంద రాజు మాదిగ, అవునూరి ప్రభాకర్ మాదిగ, గుండ్రెడ్డి రాజు, గుండా థామస్, ఎలగందుల బిక్షపతి, సావనపెల్లి రాకేష్, శంకర్, సురేష్, నాంపెల్లి ఉన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుంచి డప్పుచప్పులతో తరలివెళ్లి తహసీల్దార్ శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తర్రే శంకరయ్య, నాయకులు లింగంపెల్లి అర్జున్, దుమ్మ అంజయ్య, లింగంపల్లి బాబు, దుమ్ము రమేష్, అవునూరి రాజు, బోడ్డు ప్రకాష్, చిలక రమేష్, చిలక స్వామి, కోమ్ము చిరంజీవి, కొమ్ము రమేష్, నేరేళ్ల సురేష్, గుడిసే నర్సయ్య, శేఖర్, శంకర్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

● ఇల్లంతకుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈదులకంటి రిషిత్‌రెడ్డి జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్‌లు, మారవేణి చంద్రశేఖర్ ఇంగ్లీష్ డిక్షనరీలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిణి రాణి, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, దావీద్, ఆనంద్‌కుమార్, సురేష్, సంజీవ్, శ్రావణ్‌లతో పాటు రిషిత్‌రెడ్డి స్నేహితులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలోని సనుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఎన్జీవో ఆధ్వర్యంలో న్యాతరి నాగమణి, కొంకటి రవి ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్ శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, పీఎస్ ప్రధానోపాధ్యాయులు ముఖేష్, ఉపాధ్యాయులు గుర్రం మల్లారెడ్డి, అంబటి శంకర్, ఎస్. శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, రాజ్ కుమార్ సుజాత, గంగాభవాని, పద్మ, హరిష్మ, మాదవి పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తే చర్యలు తీసుకుం టామని జిల్లా పీవోఎంహెచ్ఎన్ ఇంచార్జి డాక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవా రం సిరిసిల్ల పట్టణంలోని స్కానింగ్‌సెంటర్లను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీ లించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజ్‌కుమార్, హెచ్ఈ బాలయ్య, డీహెచ్ఈ డబ్ల్యు రోజా, శ్రీలత, కానిస్టేబుల్ శ్రీలత, డాటాఎంట్రీ ఆపరేటర్ మహేష్ ఉన్నారు.

● సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల పట్టణం విమల థియేటర్ సమీపంలోని ట్రాన్స్‌ఫా రంపైకి ఎక్కిన వానరం విద్యుత్‌షాక్‌కు గురైంది. స్థానికులు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించగా ప్రాణాలతో బయటపడింది.

● ముస్తాబాద్ : మండలంలోని మోయిని కుంటలో పోచమ్మ బోనాలు తీశారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలో భాగంగా శనివారం బైండ్ల వారి ఆటలు డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు బోనాలు తీశారు.

● చందుర్తి : ఉద్యోగులకు చేసిన సేవలు గుర్తింపునిస్తాయని చందుర్తి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శంకర్, వాసం సుజాత అన్నారు. ప్రాథమిక పాఠ శాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన విక్కుర్తి లక్ష్మి నారాయణ, ప్రధానోపాధ్యాయునిగా ప్రమోషన్‌పై వెళ్లిన కటుకూరి ముఖేష్, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కడారి నరేష్, రొండి చంద్రకళలను విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, గుర్రం బాలకృష్ణ, కాపిల్ల నరేష్, ప్రసాద్, శ్రీధర్, రవి, మమ త, స్వప్న, తల్లిదండ్రులు , అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : సాగునీటి కాలువ పనులు పూర్తిచేసి నీరు ఇస్తారా లేక ప్రాణాలు తీసుకోమంటారా అంటూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 11వ ప్యాకేజీలో భాగంగా ఎల్ఎమ్ 6 కెనాల్ పనులు పూర్తిచేయాలని రైతులు చేపట్టిన దీక్ష శుక్రవారానికి 5వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరానికి రైతులు కొడవళ్ళతో వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మధు, అశోక్, పయ్యావుల బాలయ్య, కరికె నవీన్, గొడిశెల సాయి తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండలంలోని కొండాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు మైక్ సెట్ వితరణ చేశారు. పాఠశాలలో 2009-09 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులలు రూ 19 వేలు పోగు చేసి నగదును అందించారు. వాటితో మైక్‌సెట్‌తో పాటు అవసరమైన సామగ్రిని తీసుకోనున్నట్లు హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ మామిండ్ల లక్ష్మణ్,ఎఎంసీ డైరెక్టర్ క్యారం రాజు, బొందుగుల దేవిరెడ్డి, మార్వాడి గంగరాజు, యారటి కరుణాకర్, గాంగరాజు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ప్రజలు క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారి సారియా అంజుమ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో శుక్రవారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. సుమారు 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ నోడల్ అధికారి పద్మ, సూపర్‌వైజర్ మహిపాల్, ఏఎన్ఎం రాజేశ్వరి, శారద, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని ఇల్లంతకుంట, గాలిపెల్లి సహకార సంఘాలకు పర్సన్ ఇంచార్జీలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇల్లంతకుంట పర్సన్ ఇంచార్జీగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమాదేవి, గాలిపెల్లి సహకార సంఘ పర్సన్ ఇంచార్జీగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ లచ్చయ్యలు బాధ్యతలు స్వీకరించారు. సహకార సంఘాల సిబ్బంది బాధ్యతలు స్వీకరించిన పర్సన్ ఇంచార్జీలకు అభినందనలు తెలిపారు.

● సిరిసిల్ల టౌన్ : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు నిధులు తీసుకురాలేక పోయారని బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ యూత్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీజేపీని నమ్మి ప్రజలు ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినా తెలంగాణకు నిధు లు తీసుకురాలేక పోయారని ఆరోపించారు. సమావేశంలో పట్టణ యూత్ నాయ కులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా కార్యాచరణ : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించేలా పక్కా కార్యచరణను అమలు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్కిల్ కమిటీ సమావేశాన్ని సంబంధిత అధికారులతో కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కలెక్టర్ చైర్మన్‌గా 16 మంది సభ్యులతో జిల్లా స్థాయి స్కిల్ కమిటీని ఏర్పాటుచేశామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి లభించేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు జిల్లాస్థాయి స్కిల్ కమిటీ పని చేస్తుందన్నారు. జిల్లాలో 20 శాతం జనాభా తయారీ సర్వీస్‌సెక్టార్‌లో ఉపాధి పొందుతున్నారన్నారు. చిన్న పరిశ్రమల స్టాపర్,స్టార్ట్ అప్‌కల్చర్ స్టాండప్ ఇండియా స్టార్ట్ అప్ ఇండియా వంటి వాటిపై అవగహన కల్పన కార్యక్రమాలను జిల్లా స్థాయిలో స్కిల్ కమిటీ ద్వారా చేపట్టాలన్నారు. ఉపాధి అవకాశాలు సృష్టించేలా యువతను తయారు చేయాలన్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్, కేంద్ర ప్రభుత్వ రంగం, ఆర్మీ, బ్యాంక్ రిక్రూట్‌మెంట్ సంబంధించి వివరాలను యువతకు తెలియజేస్తూ వారు ఉపాధి అవకాశాలు పొందేలా అవసరమైన శిక్షణ అందించేందుకు కార్యాచరణ అమలుచేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, మున్సిపల్ భవనంలో ఆర్మీ, నేవీ సంబంధించి ఉద్యోగాలు భర్తీ వివరాలు నోటీసు బోర్డులలో ఏర్పాటుచేయాలన్నారు. జిల్లాలో ఎలక్ట్రిషియన్ కొరత కూడా ఉందని ఈ రంగంలో కూడా శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణ పనులకు సంబంధించి న్యాక్ ద్వారా శిక్షణ అందించాలని కోరారు. కొండా లక్ష్మణ్‌బాపూజీ హార్టికల్చర్‌యునివర్సిటీ ద్వారా గార్డెనింగ్, హార్టికల్చర్‌లో శిక్షణ అందించాలన్నారు. ప్రధానమంత్రి సూర్యరష్మీయోజన పథకం స్వశక్తి మహిళా సంఘాలు, మెప్మా సంఘాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. వీరికి అవసరమైన శిక్షణ తరగతులను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధికల్పన అధికారి రాఘవేందర్, డీఆర్‌డీవో శేషాద్రి, పరిశ్రమల శాఖ జీఎం హన్మంతు నాయక్, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లిఖార్జున్‌రావు, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు జనార్ధన్, రాజమనోహర్, కార్మిక శాఖ అధికారి నజీర్ మున్సిపల్ కమీషనర్‌లు సమ్మయ్య, అన్వేష్‌లు పాల్గొన్నారు.

పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా ఈనెలాఖరులోపు పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎల్ఆర్ఎస్‌పై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ఎల్ఆర్ఎస్ 2020 క్రింద 42 వేల 942 దరఖాస్తులు రాగా 23 వేల 515 దరఖాస్తులు ఆమోదించామని, 1230దరఖాస్తులు తిరస్కరించామని అన్నారు. ప్రస్తుతం ఎల్1 వద్ద 6776 దరఖాస్తులు, ఎల్2 వద్ద 385, ఎల్ 3 వద్ద 76 పెండింగ్ ఉన్నాయని, వీటిని మార్చి చివరి నాటికి పరిష్కరించాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ స్క్రూటినీ పూర్తి చేసుకుని ఆమోదించిన దరఖాస్తుదారులను ఫాలోఅప్ చేయాలన్నారు. జిల్లాలో 23 వేల 515 దరఖాస్తులు రుసుం చెల్లింపు కోసం ఆమోదిస్తే ఇప్పటివరకు 184మాత్రమే ఫీజు చెల్లించారని, మిగిలిన దరఖాస్తుదారులు మార్చి 31లోపు రుసుం చెల్లించి ప్రభుత్వం అందించే 25 శాతం రాయితీ వినియోగించుకునేలా చూడాలని అన్నారు.

పకడ్బందీగా ఎల్ఆర్ఎస్ అమలు

రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌ను నిబంధనల ప్రకారం పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం దానకిషోర్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం దానకిషోర్ ఎల్ఆర్ఎస్‌పై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఎల్ఆర్ఎస్ రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ 2020 క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నవారు పూర్తి ఫీజుతో పాటు ప్రోరాటా ఓపెన్ స్పేస్ చార్జిలను మార్చి 31లోపు చెల్లిస్తే 25 శాతం రాయితీ లభిస్తుందని అన్నారు. నిషేధిత జాబితాలో లేని, బఫర్, ఎఫ్‌టీఎల్, చెరువులు కుంటలు తదితర ప్రాంతాలలో లేని ప్లాట్లకు ఆటోమేటిక్‌గా ఎల్ఆర్ఎస్‌కు అనుమతి లభిస్తుందని చెప్పారు. చెరువులు నీటి వనరులు తదితర ప్రాంతాలకు 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు మాత్రం రెవెన్యూ నీటి పారుదల శాఖ అనుమతులు తప్పనిసరిగా చేయాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులు 90 శాతం రిఫండ్ అవుతుందని, 10 శాతం ప్రాసెసింగ్ కోసం తీసుకుంటామని అన్నారు. స్థలాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించిన వారికి అర్హత ఉంటే స్థల క్రమబద్ధీకరణ చేసి సంబంధిత ప్రొసీడింగ్స్ జారీ చేయాలని అన్నారు. ఆగస్టు 26, 2020 వరకు 10శాతం ప్లాట్లు విక్రయించిన లేఅవుట్‌లను క్రమబద్ధికరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, సబ్ రిజిస్టర్ ద్వారా నిర్ణీత నమూనాలో జిల్లా, మండలం, గ్రామం, సర్వే నెంబర్ విస్తీర్ణం, లేఅవుట్ లోని మొత్తం ప్లాట్లు క్రయ, విక్రయ లావాదేవీలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెంబర్లు సంవత్సరం వంటి అనేక వివరాలతో నూతన దరఖాస్తులు సేకరించి ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి క్రమబద్ధీకరణ చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో డీడీపీసీ అధికారి అన్సారీ, మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి



చందుర్తిలో వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

చందుర్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు మండల ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్ కుమార్‌కు శుక్రవారం వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య మాట్లాడారు. పంచాయతీ కార్మిక సంఘం నాయకులు మామిడి నరేష్, వాసం కిరణ్ కుమార్, కొమ్ము చరణ్, లక్కీ, బాబు, రాములు, మల్యాల లచ్చయ్యవజ్రవ్వ, గంగజల, లక్కీ, లచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట ఎంపిడీవో రాజేందర్‌కు గ్రామ పంచాయితీ పారిశుధ్య కార్మికులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. బకాయి వేతనాలు చెల్లించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

● వీర్నపల్లి : మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జీపీవర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్, మండల అధ్యక్షుడు న్యాత నర్సయ్య, మంత్రి వినీత్, శారద, రమేష్, నర్సయ్య, లింగవ్వ, తదిత రులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లకు చెందిన కారు కర్ణాటకలో సీజ్..?

- గంజాయి అక్రమ రవాణాలో పట్టుకున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో గంజాయి స్మగ్లింగ్ కేసులో జిల్లా చెందిన ఓ కారును అక్కడి పోలీసులు పట్టుకున్నారని తెలిసింది. కర్ణాటక రాష్ట్రంలోని విజయపుర జిల్లాలో రెండు కార్లలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకొని ముగ్గురు వ్యక్తులను అరెస్ట్‌చేశారు. ఈ సంఘటన నాలుగు నెలల క్రితం చోటుచేసుకుంది. అయితే కారు వ్యవహారం శుక్రవారం బయటకు వచ్చింది. ఈ కారు సిరిసిల్లకు చెందిన గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగిదిగా పోలీసులు భావిస్తున్నారు. కారు నంబర్ ఆధారంగా కర్ణాటక పోలీసులు ఇటీవల సిరిసిల్లకు వచ్చి విచారించినట్లు తెలిసింది. అయితే సిరిసిల్లకు చెందిన ఓ స్వీట్ హౌజ్ వ్యాపారితో కారు యజమాని సాన్నిహి త్యం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సన్నిహితుడే ఉద్యోగి కారును తీసుకెళ్లినట్లు ప్రచారమవుతోంది. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

10న మినీ మిలియన్ మార్చ్..

సిరిసిల్ల టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే మినీ మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఉద్యమ కారుల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ బుస్స వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10న హైదరాబాద్ అమరవీరుల స్థూపం వద్ద మినీ మిలియన్ మార్చ్ ఉంటుందన్నారు. కుసుమ విష్ణుప్రసాద్, చెన్నమనేని పురుషోత్తంరావు, దండు మల్లికార్జున్, సామల రాములు తిమ్మాపురం అశోక్‌చ కోమురాజుల ఐలయ్య, వెంకటరెడ్డి, నర్సింగరెడ్డి, సత్యనారాయణ, వెంగళ అంజయ్య, మల్లేశం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల మాటలు హాస్యాస్పదం..

తంగళ్లపల్లి(సిరిసిల్ల రూరల్), మార్చి7 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకుల మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు అసభ్యకరంగా మాట్లాడడం సరికాదని, కేకే మహేందర్‌రెడ్డిపై అసత్యపు ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరేళ్ల నర్సింగంగౌడ్, మునిగెల రాజు, శ్రీనివాస్‌రెడ్డి, పబ్బతి కృష్ణారెడ్డి, బైరినేని రాము, పోన్నాల పర్శరాములు, అరెపల్లి బాలు, చుక్క శేఖర్, మందాటి తిరుపతి, జలంధర్‌రెడ్డి, సామల గణేష్, మల్లేశం యాదవ్, పర్శరాములు, సుద్దాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థాయి మరిచి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకులు స్థాయిని మరిచి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిపై ఇష్టారీతిన మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లెల మాజీ సర్పంచ్ మాట్ల మధు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిపై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు గడ్డం కిరణ్, కంసాల మల్లేశం, వంతడప్పుల రాము, రెడ్డిమల్ల భాను, ప్రభాకర్, అన్నల్దాస్ భాను, గుడిసె పవన్, కొంపల్లి విజయ్ కుమార్, బుర్ర యాదగిరి పాల్గొన్నారు.

నేడు నిరసన ర్యాలీ

సిరిసిల్ల టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయంలో డాక్టర్ అంబేద్కర్, స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ ఫొటోలను తొలగించడాన్ని నిరసిస్తూ శనివారం సిరిసిల్ల పట్టణంలో ర్యాలీని చేపట్టనున్నట్లు మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణుతో కలిసి ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, భగత్‌సింగ్ చిత్రపటాలను తీసివేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. సోమ నాగరాజు, కొంపల్లి విజయ్‌కుమార్, పండుగ శేఖర్ పాల్గొన్నారు.